ఆధ్యాత్మికం



ఘనంగా రాజరాజేశ్వరస్వామి జాతర ఉత్సవాలు

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం విట్టంపేటలో రాజరాజేశ్వర స్వామి జాతర ఉత్సవాలు ఘనంగా జరిగాయి. సోమవారం ఆలయంలో అభిషేకాలు, హోమం, శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. జాతర ఉత్సవాలకు భారీగా తరలివచ్చిన భక్తులు ప్రత్యేక పూజలు చేసి కల్యాణం తిలకించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆకుల రాజారెడ్డి, వీడీసీ సభ్యులు రాములు, శంకర్, నర్సయ్య, కిషన్, రాజమల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



మల్లన్నపేటలో మల్లికార్జునస్వామి బోనాలు

గొల్లపల్లి:మండలంలోని మల్లన్నపేటలో మల్లికార్జునస్వామి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. సోమవారం దండివారం సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వేల సంఖ్యలో భక్తులు స్వామివారి దర్శించుకుని, బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మండల తహసీల్దార్, నాయబ్ తహసీల్దార్, ధర్మపురి సీఐ రమణమూర్తి స్వామివారిని దర్శించుకున్నారు. దండివారం ఒక్కరోజు రూ. 74,500 ఆదాయం సమకూరినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.



ఘనంగా సుబ్రహ్మణ్య షష్ఠి ఉత్సవాలు

కోరుట్ల: పట్టణంలోని అయ్యప్ప ఆలయంలో సుబ్రహ్మణ్య షష్ఠి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అయ్యప్ప ఆలయ గౌరవాధ్యక్షుడు చిద్రాల నారాయణ, అంబటి శ్రీనివాస్, రాజు, అజయేంద్రరావు, గురుస్వాములు పాల్గొన్నారు.
మల్యాల: మండల కేంద్రంలోని అయ్యప్ప క్షేత్రంలో సోమవారం ఆధ్యాత్మిక గురువు మిట్టపల్లి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి దీక్షాపరులు సుబ్రమణ్యేశ్వరస్వామి షష్ఠి ఉత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పడిపూజ, భిక్ష నిర్వహించారు. కార్యక్రమంలో గుర్రం లక్ష్మీనారాయణ, గుండేటి మోహన్,దీక్షాపరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మల్లెగుట్టపై భక్తుల సందడి

మల్యాల: మండల కేంద్రంలోని మల్లెగుట్టపై కొలువైన శ్రీ మల్లికార్జున స్వామి సన్నిధిలో పట్నాల సందడి నెలకొంది. దండి వారాన్ని పురస్కరించుకుని వందలాదిమంది భక్తులు స్వామివారిని దర్శించుకొని, పూజలు చేశారు. మల్లికార్జున స్వామి సన్నిధిలో సోమవారం రాత్రి నిదరించారు. భక్తులు మంగళవారం ఉదయం స్వామివారి సన్నిధిలో పట్నాలువేసి, బోనాలతో నైవేద్యం సమర్పించి, మొక్కులు చెల్లించుకుంటారు.

పరిసరాలు శుభ్రం చేయించాలి

రాయికల్: పట్టణంలోని బాలికల పాఠశాల ఆవరణలో శుభ్రం చేయించాలని కోరుతూ సోమవారం కౌన్సిలర్ మ్యాకల అనురాధ ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రులు కమిషనర్ సంతోష్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. పాఠశాల ఆవరణలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా ఉందని వెంటనే శుభ్రం చేయించాలని కోరారు.

ఆర్థిక లావాదేవీలపై విద్యార్థులకు అవగాహన


పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేస్తున్న మేనేజర్

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆర్థిక లావాదేవీలపై తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ రవి వర్మ సోమవారం అవగాహన కల్పించారు. బ్యాంకులో నగదు లావాదేవీలు ఏ విధంగా నిర్వహించుకోవాలో వివరించారు. అనంతరం 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రాజన్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలింగ్‌బూత్‌ల సంఖ్య పెంచాలని వినతి


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రాజేశ్

రాయికల్: మండలంలోని మైతాపూర్‌లో పోలింగ్ బూత్‌ల సంఖ్యను పెంచాలని కోరుతూ సోమవారం గ్రామానికి చెందిన తలారి రాజేశ్ తహసీల్దార్ ఖయ్యూంకు వినతిపత్రం సమర్పించారు. 44, 45, 46 నంబర్లలో పోలింగ్ బూత్‌లున్నాయని, ఈ మూడు బూత్‌ల్లో కలిపి 2746 మంది ఓటర్లున్నారని, పోలింగ్ బూత్‌లను పెంచాలని కోరారు.

ఎనిమియా ముక్త్ భారత్ కోసం కృషి చేయాలి


చిన్నారులకు వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యులు

మల్లాపూర్: ఎనిమియా ముక్త్ భారత్ కోసం కృషి చేయాలని ఆర్‌బీఎస్‌కే వైద్యరాలు డాక్టర్ శ్రావిక అన్నారు. మండలంలోని వేంపల్లి ప్రాథమిక పాఠశాలలో రాష్ట్రీయ బాల స్వస్థియా కార్యక్రమం అమలులో భాగంగా సోమవారం నిర్వహించిన వైద్యశిబిరంలో పాల్గొని మాట్లాడారు. 6 నుంచి 14 ఏళ్ల లోపు విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జక్కుల నవీన్‌కుమార్, ఫార్మాసిస్టు రాధ, ఏఎన్‌ఎం సరిత, ఉపాధ్యాయులు, విద్యార్థులుపాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న శివానందం

కోరుట్ల: ప్రభుత్వం పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ పెన్షనర్స్ సెంట్రల్ అసోసియేషన్ కోరుట్ల డివిజన్ అధ్యక్షుడు పబ్బ శివానందం అన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం లాగా కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ప్రభుత్వ ఉద్యోగులకు, పెన్షనర్లకు 43 శాతం పీఆర్సీ ఇవ్వాలన్నారు.రాష్ట్ర అధ్యక్షుడు గాజుల నర్సయ్య, జిల్లా అధ్యక్షుడు హరి అశోక్ కుమార్ ఆధ్వర్యంలో రాజీలేని పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గంటేడి రాజ్‌మోహన్, నల్లాల లక్ష్మీ నారాయణ, ఉపాధ్యక్షుడు ఎండీ. సైఫొద్దీన్, రాములు, మండలాల ప్రతినిధులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు

- మాస్టర్‌ప్లాన్ జగిత్యాల మున్సిపాలిటీకే పరిమితం
- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు

జగిత్యాలరూరల్: ప్రజాసంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లవంటివని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. మాస్టర్‌ప్లాన్ జగిత్యాల మున్సిపాలిటీకే పరిమితమన్నారు. సోమవారం జగిత్యాల మండల సర్వసభ్య సమావేశాన్ని ఇన్‌చార్జి ఎంపీపీ ములాసపు లక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. పీఎం కిసాన్ కింద కేంద్రం ఎన్నిసార్లు ఆర్థికసాయం అందించిందని అంబారిపేట సర్పంచ్ గంగాధర్, మోతె ఎంపీటీసీ రాజశేఖర్ రెడ్డి ప్రశ్నించారు. వైద్య అధికారులు గ్రామాల్లో సర్పంచులు, ఎంపీటీసీలకు సమాచారం అందించడం లేదని సర్పంచులు గంగాధర్, ప్రభాకర్ అధికారులను నిలదీశారు. మిషన్ భగీరథ నీటి సరఫరా కోసం మోతెలో రెండు ట్యాంక్‌ల నిర్మాణం చేపడుతున్నా ఒకటి మాత్రమే నిర్మాణం పూర్తయిందని, దానికి ఇప్పటివరకు పైప్‌లైన్ బిగించలేదని ఎంపీటీసీ రాజశేఖర్‌రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. అనంతరం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ మాట్లాడుతూ కరోనా మహమ్మారితో ప్రజలెంతో ఇబ్బందులు ఎదుర్కొన్నా ప్రభుత్వం మాత్రం అభివృద్ధి, సంక్షేమం ప్రజలకు అందిస్తూనే వచ్చిందన్నారు. సమావేశంలో కార్యక్రమంలో జెడ్పీటీసీ మహేశ్, సింగిల్ విండో చైర్మన్ మహిపాల్‌రెడ్డి, ఎంపీడీవో శైలజరాణి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం

జగిత్యాల మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ మొదటిసారి హాజరు కావడంతో ఇన్‌చార్జి ఎంపీపీ లక్ష్మి, జెడ్పీటీసీ మహేశ్, ఎంపీటీసీలు, సర్పంచులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు.

ఉపాధి కల్పించాలని ఆటో డ్రైవర్ల ఆందోళన


పెగడపల్లిలో నిరసన వ్యక్తం చేస్తున్న ఆటో డ్రైవర్లు

జగిత్యాల టౌన్/ మల్యాల/ గొల్లపల్లి/పెగడపల్లి /రాయికల్: ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో ఉపాధి కోల్పోయామని, వెంటనే ఉచిత ప్రయాణం రద్దు చేసి తమకు ఉపాధి కల్పించాలని ఆటో డ్రైవర్లు నిరసన చేపట్టారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో ఆర్డీవో కార్యాలయం నుంచి ఆటోలతో ర్యాలీగా బయలుదేరి కలెక్టరేట్ చేరుకుని నిరసన కొనసాగించారు. ఆటోలపై తీసుకున్న రుణాలను మాఫీ చేసి, ప్రతినెలా రూ.10 వేలు అందించి ఆదుకోవాలని కోరారు. అనంతరం ప్రజావాణిలో వినతిపత్రం సమర్పించారు. రాయికల్ ఆటో డ్రైవర్లు చేపట్టిన నిరసనకు బీజేపీ నాయకురాలు భోగ శ్రావణి మద్దతు తెలిపారు. ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మల్యాల మండల కేంద్రంలోని అడ్డరోడ్డు వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఆటోలకు అన్ని రకాల పన్నులు రద్దు చేయడంతోపాటు, ప్రతి నెలా రూ.4000 పెన్షన్ ఇవ్వాలని, లేనిపక్షంలో ఆటో డ్రైవర్లకు ప్రత్యామ్నాయ ఉపాధి మార్గం చూపాలంటూ నినాదాలు చేశారు. పెగడపల్లిలో ఆటోలతో నిరసన ర్యాలీ చేపట్టారు. బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణంతో జీవనోపాధి కోల్పోయి ఆర్థికంగా దెబ్బతిని తమ కుటుంబాలు వీధిన పడ్డాయని జీవనోపాధి కోల్పోయినందుకు ప్రభుత్వం తమకు నెలకు రూ. 25 వేలు గౌరవ వేతనం చెల్లించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గొల్లపల్లిలో మండల ఆటో యూనియన్ కార్మికులు సోమవారం తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమాల్లో ఆటో డ్రైవర్లు, యూనియన్ల నాయకులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

మళ్లీ కేసీఆర్ ప్రభుత్వమే వస్తుంది

- కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్

ఇబ్రహీంపట్నం: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎక్కువ రోజులు ఉండదని, మళ్లీ కేసీఆర్ ప్రభుత్వమే వస్తుందని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అన్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన ఆయన తొలిసారి మండలంలోని అమ్మక్కపేట, డబ్బా, వర్షకొండలో పర్యటించారు. కేసీఆర్ ప్రభుత్వం లేదని ఎవరూ బాధపడొద్దని త్వరలోనే మంచిరోజులు వస్తాయని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డికి పాలన విధానం అర్థం కావడం లేదన్నారు. తనను గెలిపించిన ప్రజలకు అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. విద్య, వైద్యంపై శ్రద్ధ చూపుతానన్నారు. అమ్మక్కపేటలో గ్రంథాలయం ఏర్పాటు చేస్తానని, కాకతీయ కాలువతో చెరువులు నింపేందుకు కృషి చేస్తానని అన్నారు. వైస్ ఎంపీపీ నోముల లక్ష్మారెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు పొనకంటి వెంకట్, కో-ఆప్షన్ ఎలేటి చిన్నారెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

కోరుట్ల: ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అన్నారు. పట్టణంలోని 20వ వార్డులో సోమవారం మార్నింగ్‌వాక్ నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నం లావణ్య, వార్డు కౌన్సిలర్ గంధం గంగాధర్, ఏఈ లక్ష్మితో కలిసి వార్డులో పర్యటించారు.సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

కేంద్రప్రభుత్వ పథకాలను క్షేత్ర స్థాయికి తీసుకెళ్లాలి


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

ధర్మపురి: కేంద్రప్రభుత్వ పథకాలను క్షేత్ర స్థాయిలో తీసుకెళ్లాలని బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్ కుమార్ తెలిపారు. వికసిత్ సంకల్పయాత్రలో భాగంగా సోమవారం మండలంలోని దొంతాపూర్ లో కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించి పోస్టర్లను ఆవిష్కరించారు. దేశ వ్యాప్తంగా ప్రధానమంత్రి మోదీ ప్రవేశపెట్టిన పథకాలను ఈ యాత్ర ద్వారా ప్రజలకు అవగాహన కల్పించడే ప్రధాన లక్ష్యమని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కొండపెల్లి రాంచందర్‌రావ్, మాజీ సర్పంచ్ రాంటెంకి గణపతి, నాయకులు పాల్గొన్నారు.
సారంగాపూర్:కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వివిధ పథకాలపై సోమవారం బీర్‌పూర్ మండలంలోని రేకులపల్లి, చిన్నకొల్వాయి, కోమన్‌పల్లి, కొల్వాయి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. వికసిత్ సంకల్ప్ యాత్రలో భాగంగా కేంద్రం ప్రవేశపెట్టిన వివిధ సంక్షేమ, అభివృద్ధి పథకాలు, గ్రామాల్లో వాటి అమలు తీరుపై ప్రచారం నిర్వహించారు. కార్యక్రమలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నీలిమ, అంగన్‌వాడీ టీచర్లు, అధికారులు, ప్రజాప్రతినిధులు, ఆయాలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.
పెగడపల్లి:మండలంలోని ఏడుమోటలపల్లి, ల్యాగలమర్రి గ్రామాల్లో సోమవారం అధికారులు వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. ఆయా గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, వాటి ప్రయోజనాలపై ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు.

ఆటో కార్మికులకు అండగా ఉంటాం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల: ఆటో కార్మికులకు అండగా ఉంటామని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. సోమవారం ఆటో యూనియన్ నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టగా ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడుతూ, ఆటో కార్మికులను, ఓనర్ కం డ్రైవర్లను ఆదుకోవాలని, ప్రతినెల రూ.10 వేల జీవనభృతి చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు శెట్టి శ్రీనివాస్, అరుముల్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు అభినందనలు

జగిత్యాల: రెండోసారి ఎమ్మెల్యేగా గెలిచిన సంజయ్‌కుమార్‌ను మౌంట్ కార్మెల్ స్కూల్‌కు చెందిన సిబ్బంది కలిసి అభినందనలు తెలిపారు.కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జ్యోతి, జ్యోస్మి, విజ్ఞాన్, శశి పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం గుట్రాజ్‌పల్లి గ్రామానికి చెందిన జుర్రు మల్లేశం అనే రైతు ఇటీవల విద్యుత్‌షాక్‌తో మృతిచెందగా ఆయన కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ పరామర్శించి ఓదార్చారు. అంతర్గాం గ్రామానికి చెందిన పొద్దుటూరి దేవవ్వ మరణించగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.
సారంగాపూర్: మండలంలోని రంగపేట గ్రామంలో సోమవారం పలు కుటుంబాలను ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ కలిసి వారిని పరామర్శించారు. భూమేశ్వరి, మల్లీశ్వరి ఇటీవల శస్త్రచికిత్సలు జరగగా వారిని కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం రంగపేట, ఒడ్డెరకాలని గ్రామాలకు చెందిన రాజన్న, పెద్ద ఎల్లయ్య ఇటీవల మృతిచెందగా, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట విండో వైస్‌చైర్మన్ పల్లపు బాపిరాజు, మండల వైస్‌ఎంపీపీ సొల్లు సురేందర్, సర్పంచులు, నాయకులు ఉన్నారు.

ఎంపీపీ ఎన్నికపై కసరత్తు?

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ ఎంపీపీగా పనిచేసిన గాజర్ల గంగారాం రెండేళ్ల క్రితం కరోనాతో మృతి చెందాడు. దీంతో ఇన్‌చార్జి ఎంపీపీగా అప్పటి వైస్ ఎంపీపీ పాలెపు రాజేంద్రప్రసాద్‌ను నియమించారు. బీసీ అభ్యర్థిని ఎంపీపీగా చేయాలని గతంలో మెజార్టీ ఎంపీటీసీ సభ్యులు కోరినా ఎన్నిక నిర్వహించలేదు. దీంతో ఇటీవల పలువురు ఎంపీటీసీలు ఎంపీపీ ఎన్నిక చేపట్టాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లడంతో సోమవారం జగిత్యాల రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో ఎమ్మెల్యే అధికారులతో కలిసి ఎంపీపీ ఎన్నికపై పలువురి అభిప్రాయాలను సేకరించారు. అలాగే ఎంపీపీ ఎంపిక విధానంపై కూడా సమీక్షించారు.

నలంద విద్యార్థుల ప్రతిభ

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని నలంద డిగ్రీ కళాశాలలో విద్యార్థులు శాతవాహన యూనివర్సిటీ ప్రకటించిన ఐదో సెమిస్టార్ ఫలితాల్లో అత్యంత ప్రతిభ కనబర్చారు. బీఎస్సీ విభాగంలో పూజిత 9.62 జీపీఏతో యూనివర్సిటీ మొదటిస్థానం సాధించగా, కాసారపు కల్యాణి 9.27, గందం మనస్వి 9.19, బొడ్ల వైష్ణవి 9.15, శ్రీజ 9, లైఫ్ సైన్స్ విభాగంలో మదియ నూరిన్ 9.33, బీబీఏ విభాగంలో పూజ 9 జీపీఏ సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను కరస్పాండెంట్ శ్రీపాద నరేశ్ అభినందించారు.

రాగోజీపేటలో నూతన జీపీ ప్రారంభం


సర్పంచ్‌ను సన్మానిస్తున్న విప్ ఆది శ్రీనివాస్

మేడిపల్లి: మండలంలోని రాగోజీపేటలో నూతన పంచాయతీ భవనాన్ని ప్రభుత్వ విప్,వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రారంభించారు. ప్రభుత్వ విప్‌గా పదవి బాధ్యతలు స్వీకరించి మొట్టమొదటి సారిగా మండలానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు సర్పంచ్ బాలసాని లహరిక, గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ హరిచరణ్ రావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నరేష్ రెడ్డి, రమేష్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విప్‌కు పలువురి శుభాకాంక్షలు


శుభాకాంక్షలు తెలుపుతున్న పాత్రికేయులు

వెల్గటూర్: రాష్ట్ర ప్రభుత్వ విప్‌గా నియమితులైన ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు నక్క లక్ష్మణ్ కుమార్ ఆధ్వర్యంలో వెల్గటూర్ ప్రెస్‌క్లబ్ పాత్రికేయులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

సమస్యల పరిష్కారంపై వినతి

వెల్గటూర్: తమ గ్రామంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని స్తంభంపల్లి గ్రామస్తులు ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్‌ను సోమవారం కలిసి వినతి పత్రం ఇచ్చారు. గ్రామంలోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయానికి సంబంధించిన అభివృద్ధి నిలిపివేశారని విన్నవించగా, స్పందించిన ఎమ్మెల్యే సత్వరమే పనులు ప్రారంభించాలని ఆలయ ఏఈని ఆదేశించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు పాదం దుబ్బస్వామి, గంగయ్య, హరి ప్రశాంత్, నరేష్, రమేశ్, కొమురయ్య, గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ధర్మపురి: పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో సోమవారం సుబ్రహ్మణ్య స్వామి షష్ఠి పూజలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ హాజరై స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆలయ వ్యవస్థాపకులు భీమనాతి మంగ అశోక్ లక్ష్మణ్‌కుమార్‌ను సన్మానించారు.

సంక్షిప్త వార్తలు

మహిళల ఆరోగ్యానికి పౌష్టికాహారం అవసరం

జగిత్యాలరూరల్: మహిళల ఆరోగ్యం కోసం పోషకాహారం ఎంతో అవసరమని ఐసీడీఎస్ సీడీపీవో వీరలక్ష్మి అన్నారు. సోమవారం జగిత్యాల అర్బన్ మండలం ధరూర్‌లో వికాసిత్ భారత్ సంకల్ప్ యాత్ర కార్యక్రమంలో భాగంగా గ్రామపంచాయతీలో కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. పోషణ్ అభియాన్ పథకంలో చిన్నారులకు, తల్లులకు, గర్భవతులకు, మహిళలకు పోషకాహారం అందిస్తున్నట్లు తెలిపారు. . కార్యక్రమంలో సర్పంచ్ డెక్క ప్రభాకర్, పోషణ అభియాన్ జిల్లా కో-ఆర్డినేటర్ మధుకుమార్, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

కాలువకు మరమ్మతులు

సారంగాపూర్: మండలంలోని రేచపల్లి-సారంగాపూర్ గ్రామాల మధ్య గండి పడిన డీ-53,12 ఎల్, 1ఆర్ కాలువకు నీటిపారుదల శాఖ అధికారులు మరమ్మతులు చేపట్టారు. గత వర్షాకాలంలో భారీ వరదలతో పాటు, ఎస్‌ఆర్‌ఎస్పీ నీరు ఎక్కువ మొత్తంలో రావడంతో 1 ఆర్ కాలువకు పలు చోట్ల గండ్లు పడ్డాయి. దీనితో ఎస్సారెస్పీ డీఈ చక్రూనాయక్ ఆధ్వర్యంలో అధికారులు రెండు రోజుల్లో యాసంగి సాగుకు నీరు విడుదల చేస్తున్న నేపథ్యంలో గండ్లు పడిన చోట గండ్లను మూసివేస్తున్నారు. కాగా సారంగాపూర్ శివారుల్లోని ఈదుల్ల ప్రాంతంలో 1ఆర్ కాలువ కోతకు గురికావడంతో ఎప్పుడైనా తెగిపోయే ప్రమాదం ఉందని దీనికి వెంటనే మరమ్మతులు చేపట్టాలని రైతులు డీఈ చక్రూనాయక్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు.

ప్లాస్టిక్ రహిత పర్యావరణాన్ని నిర్మిద్దాం

జగిత్యాల: ప్లాస్టిక్ రహిత పర్యావరణాన్ని నిర్మిద్దామని హెచ్‌ఎం చంద్రకళ అన్నారు. సోమవారం ఓల్డ్ హైస్కూల్‌లో విద్యార్థులు జ్యూట్ బ్యాగులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్లాస్టిక్ భూతాన్ని తుదిముట్టించాలని, ప్లాస్టిక్ రహిత పర్యావరణంలోకి మారేందుకు విద్యార్థులు వారి తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌జీసీ ఇన్‌చార్జి ఆనందరావు, దేవయ్య, సూర్యప్రకాశ్, రజిత, పద్మ, విద్య, అనిత, స్వరూప పాల్గొన్నారు.

ఇసుక డంపులు పట్టివేత

మెట్‌పల్లిరూరల్: అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంపులను సీజ్ చేసినట్లు మెట్‌పల్లి ఎస్సై చిరంజీవి తెలిపారు. సోమవారం మెట్‌పల్లి మండలం వెల్లుల,రామలచ్చక్కపేట శివారు ప్రాంతాల్లో సుమారు 100 ట్రాక్టర్ల ఇసుకను డంప్ చేసినట్లు గుర్తించామని, తదుపరి చర్యల కోసం రెవెన్యూ అధికారులకు అప్పగించామన్నారు. అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

నేడు ఇసుక డంపులకు వేలం

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం వెల్లుల,రామలచ్చక్కపేట శివారు ప్రాంతాల్లో సోమవారం పట్టుబడిన సుమారు 110 ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుకకు మంగళవారం ఉదయం 10 గంటలకు వేలం వేయనున్నట్లు మెట్‌పల్లి తహసీల్దార్ శేఖర్ తెలిపారు. వేలంలో పాల్గొనడానికి ఆసక్తి ఉన్న వ్యక్తులు ముందుగా నాయబ్ తహసీల్దార్ వద్ద రూ.5 వేలు ధరావత్ చెల్లించాలని సూచించారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

కోరుట్ల: కోరుట్ల పట్టణానికి చెందిన మాజీ కౌన్సిలర్లు సంగ లింగం, రియాజ్, మాదాపూర్‌కు చెందిన ఎంపీటీసీ కృష్ణారెడ్డి, ఉప సర్పంచ్ మల్లారెడ్డి సోమవారం కాంగ్రెస్ నాయకుడు జువ్వాడి నర్సింగరావు సమక్షంలో కాంగ్రెస్‌లో పార్టీలో నాయకులు చేరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ, మండల పార్టీ అధ్యక్షుడు తిరుమల గంగాధర్, కొంతం రాజం, నయీం, ఖయ్యూంలు పాల్గొన్నారు.

విద్యతోనే మహిళ సాధికారత

జగిత్యాల: విద్యతోనే మహిళ సాధికారత సాధ్యమవుతుందని జిల్లా మిషన్ కో-ఆర్డినేటర్ అశ్విని అన్నారు. సోమవారం ఇస్లాంపురలో ఉన్న మైనార్టీ మహిళలకు బేటి బచావో, బేటి పడావో పథకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మహిళల పట్ల జరుగుతున్న హింసలకు, వాటి నిరోధానికి మహిళలు మానసికంగా, శారీరకంగా ధృఢంగా ఉండాలన్నారు. మహిళల కోసం సఖీ 181, చైల్డ్‌లైన్ 1098 టోల్‌ఫ్రీ నంబర్లను వినియోగించుకోవాలని, ఇంట్లో తల్లిదండ్రులు బాగా చూసుకోకపోయినా 14567 నంబరుకు ఫోన్ చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రాణి, రిజ్వానా, ఖలేదా, సుధారాణి పాల్గొన్నారు.

ఫ్రెండ్స్ వెల్ఫేర్ ట్రస్ట్ సేవలు అభినందనీయం

మెట్‌పల్లి: పేదల కోసం ఫ్రెండ్స్ వెల్ఫేర్ ట్రస్ట్ అందిస్తున్న సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అన్నారు. ట్రస్ట్ కార్యక్రమాల కోసం నూతనంగా కొనుగోలు చేసిన వాహనాన్ని సోమవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రస్ట్ ఆధ్వర్యంలో చేసే సేవా కార్యక్రమాలకు తన వంతు సహకారమందిస్తానన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు సురిగి శ్రీనివాస్ మోహన్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, రవి, నరేశ్, గణేశ్, మనోజ్, వాసు తదితరులున్నారు.

టాటా ఏస్ ఢీకొని ఒకరికి గాయాలు

ధర్మపురి: టాటా ఏస్ బైక్ ఢీ కొనడంతో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. జగిత్యాల నుంచి ధర్మపురికి బైక్‌పై వస్తుండగా మండలంలోని ఆకసాయిపల్లె గుట్ట మలుపు వద్ద సోమవారం సాయంత్రం ఎదురుగా వస్తున్న టాటా ఏస్ ఢీకొట్టడంతో కాలువల రాజేశ్ అనే వ్యక్తికి తీవ్ర గయాలయ్యాయి. వెంటనే 108 అంబులెన్స్‌లో ధర్మపురి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దత్తాత్రి తెలిపారు.

సమాచారం..

20న మెట్‌పల్లిలో జిల్లా స్థాయి పోటీలు

మెట్‌పల్లి: పట్టణంలోని మినీ స్టేడియంలో ఈ నెల 20న అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు ప్రధాన కార్యదర్శి ఏలేటి ముత్తయ్యరెడ్డి సోమవారం తెలిపారు. అండర్-14, అండర్-18 విభాగాల్లో వివిధ పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆసక్తి గల బాలబాలికలు 9182406818, 9490548355 నెంబర్లకు ఫోన్ చేసి సంప్రదించాలని సూచించారు.